


నిజ్జం సావి. నాకాడ ఇన్నూరు జీవాలుండేటివి. ఈ సంగజ్జెప్తే సెవిలో పూలు పెడ్తన్నా వేందిరాన్న, మాదిరి సూడగాకు. సత్తె పమానకంగా సెప్తుండా. నాకాడ ఇన్నూరు జీవాలుండేటివి. ఉండేటివంటే ఇపుడేడికి పాయినాయని అడగాకు దొరా! ఆ సంగతులు సెప్పనీకే మొదలుపెట్టినా కడదాంకిని, సావీ! నీకు పున్నెముంటాది. ఎవరికోరికి సెప్పుకుంటే నా గుండెల్ల బరువు దిగుతాదని సెప్తుండా సావీ!

ఇన్నూరు జీవాలు మేవుకుంటూ కూడుదిన్నీకి, వంటిపైన గుడ్డకు దిగుల్లేకుండా గౌరువంగా బతుకుతుంటిమి. మా బుడ్డోడు సదువుకుంటా నాయనా, సదువుకుంటా అని ఎంత ఏడ్సినా సదువుకుని చేసేటి దేందుందని, "జీవాలు కాసుకునీకి సదువెందుకురా సిన్నోడా! సదువు నీ క్కూడు దెచ్చిస్తాదేమిరా?" అని వాన్ని బడికి పంపీకపోతి. నా పెండ్లాంగా బుడ్డోడ్ని బళ్లోకి పంపీమని బంగపాయె. నే నిండ్లే. ఇపుడు జీవాల్లేవు కాసుకునీకి బుడ్డోడి గతి అనుకుంటాంటే గుండెల్ల గుబులు గుబులయితాంది. వానికి మూతిమీన మీసమొచ్చే వయసొచ్చింది. ఇపుడింగ బడికి పోనీకి అయ్యే పనికాదు.

బుడ్డోడు కాక నా కొక్క కూతురుంది. బంగారు బొమ్మలెక్కుంటాది. దాన్ని తీస్కపోయి మా లెక్కనే గొర్లు కాసుకునే మద్దిలేటి కిచ్చి పెండ్లి చేస్తి. నూరు గొర్లుండేటివి ఆళ్లకాడ. మద్దిలేటి సాన మంచోడు. బిడ్డ అదురుష్టవంతురాలే అని నేను నాపెండలాం మురిసిపోతిమి. ఇప్పుడు వాళ్లకాడ ఒక్క జీవం కూడా లేదు, సామీ! నాకాడికొచ్చి కూతురు అల్లుడు కండ్లల్లో నీరు కార్సుకుంటా చెప్పిరి. నేను సరింగా సూల్లే గాని, వాళ్ల కండ్లల్లో నీళ్లే కాదు, నెత్తురు గాని కారుంటాది. అయినా నా

# నీలి నాటిక

డా॥గుర్రాల రవికృష్ణ

కాడికొచ్చి సెప్తే నేనేమన్నా ఆర్చేటోన్నా, తీర్చేటోన్నా.

ఎండాకాల మొచ్చినాదంటే మా గుండెలు మండి ఎండిపోతాయి, సామీ! యాడసూడు జీవాలకు మేత సిక్కదు. తాగనీకి రొన్ని నీల్లుండవు. వాగులు, వంకలు, ఏర్లు అన్నీ ఎండిపాయి దిగులు మొగాలేసుకునుంటాయి. జీవాలు రాన్రాను బక్కసిక్కి పోతాంటే సూళ్లేక అల్లాడిపోవాల. సూస్తా సూస్తా సంపుకోలేక అమ్మనీకి సంతకు తోల్కపోతే మారు బేరగాళ్లొచ్చి ఎయ్యి రూపాయలయ్యే గొర్రెని అయిదు నూర్లకు అగ్గవలో మాకాడ కొని ఆళ్లు ఎయ్యి రూపాయల కమ్ముకుంటారు. మారు బేరగాళ్ల మాటినకపోతే అమ్మనీకే కట్టమైతాది. మేం ఎండ, వాన, సలి ఎట్టున్నా ఇంటికాడ పెండ్లాం పిల్లల్నొదిలి వూర్లు వూర్లు కొండలు గుట్టలు తిరుక్కుంటా జీవాలు మేపుకుంటాంటే పట్నంలో యాలపొద్దు కింతకూడు దిని కూచోని మారు బేరం జేసేటోల్లు జీవానికి ఇన్నూరు పైనే లాభం గుంజుకుంటా వుండారు.

పోయిన ఎండాకాలం మా వూర్లకెల్లి జీవాలకు మేతలేక బక్కసిక్కిపోతా వుంటే ఆదోని కెల్లిపోయి ఆడ గొర్లు మేపుకొనీకని మందను తోల్కపోతి. మైల్లు మైల్లు రోడ్డెంట మందను తోల్కబోయేది ఎంత కస్టమో సెప్పినా ఎవురుకి తెలవదు. యా బస్సుకిందనో లారీ కిందనో జీవాలు పడ్తాయేమోనని గుండెలు భయంతో కొట్టుకుంటూ వుంటాయి. గొర్లు పక్కలకు పోనీకుండా కాపలా కుక్కలెంటున్నా జీవాలు తప్పిపోతాయని గుండెలు గుబగబలాడ్తాంటాయి.

యాదో పల్లెకాడ సామి, గొర్లన్ని గుంపుగా రోడ్డువారగా పోతున్నాయి. ఆ దిక్కునే జీపులు కొన్ని, ఇడిసిన బొనాల మాదిరి యమసీప్డుగా వచ్చినాయి. మురాలోల్ల జీపులున్నట్టున్నాయి. ఇంతలో గుంపునుండి తెల్లపొట్టేలు పక్కకొచ్చినాది. పొట్టేలు రోడ్డు మద్దెకొచ్చిన సంగతి దూరం నుండే కానొచ్చినా గానీ లెక్క చేయకుండా జీపొచ్చి పొట్టేల్ని కొట్టింది. అది గిలగిల కొట్టుకుని మా కండ్లముందే రోడ్డుమీన సచ్చినాదిసామీ! ఆ జీవం మా బుడ్డోడు పానంగా సూసుకునే పొట్టేలు. అది బాగా బలిసి మంచి బేరమొచ్చినా సంతలో సానా మందడిగినా బుడ్డోడి నేస్తమని అమ్మనీ కొప్పుకోలే. అట్టాంటి పొట్టేలు జీపుకింద పడి గిలగిల కొట్టుకుని రక్తం మడుగులో పడుంటే బుడ్డోడి కండ్లల్లో ఏడుపు తన్నుకొచ్చినాది. జీపును పోనీకుండా బుడ్డోడు అడ్డం నిలబడ్నోడు నే నొద్దని మొత్తుకుంటున్నా ఇనకుండా. ఆళ్లతో పెట్టుకుంటే సిన్నోల్లం మనల్ని బతకనీర్రా అని సెప్తాన్నా ఇన్పించుకోలే. జీపులో ముందుపక్కల కద్దరు సొక్కా ఏసుకున్నాయ నొకాయన కూసోనున్నాడు. ఇంతంత లావు మీసాలు, ఎర్రగైన గుంటనక్క కండ్లతో నుదురుమీద ఎర్రబొట్టు పెట్టుకుని మెళ్లో ఇంత లావు బంగారు పులిగోరు గొలుసు ఎస్కోనున్నాడు. సేతులకు బంగారు కడియాల మాదిరి గుండేవి తొడుక్కోనున్నాడు. నోట్లొ సిగరెట్టు పొగలు సెగలు కక్కుతాంది. ఆయప్ప కీవక్క ఆ వక్క యెనకాల ఇంతింత పొడవు తుపాకులు పట్టుకుని యములోల్ల మాదిరి, సూస్తానే వనుకు పుట్టిచ్చేట్లున్న మనుసులు కూచోనున్నారు. సచ్చిన పొట్టేలుకు డబ్బులీమని బుడ్డోడడగుతాంటే ఎర్రోన్ని సూసినట్లు సూసి వగలబడి ఇరగబడి నా గుండెలదిరేట్లు నగినాడు సామి పెద్దాయన. "ఏమిరా, నీ గొర్రెలకూ, నీకూ వళ్లు కొవ్వెక్కినట్లుందే! మా జీపులొస్తాంటే పక్కకు తోలుకునేది లేదేంరా! జీపుకు అడ్డం పడేట్లు చేసి మాకాడ్నించి డబ్బులు గుంజనీకి ఎత్తేసినార్రా! ఈ పిల్లనాకొడుకు బో ఆగిత్యం చేస్తాన్నాడు. ఆ పిల్లనాకొడుకు సంగతి సూడండి!" అనగానే యెంటుండే మన్సులు బుడ్డోడ్ని కాళ్లతో సేతుల్తో కిందా మీదా పడేసి కొట్టిరి. అడ్డం పోతే నన్నుకొట్టిరి. జీపుతో పొట్టేల్ని సంపింది కాక మమ్మల్ని కొట్టి మల్లీ మంచి బలిసిన జీవాన్నోదాన్ని జీపులో యేసుకుని నగుకుంటా పోయిరి.



మా జీవాలకు తెలివి లేదు. అవి గొర్రెలు. ఆళ్లు మన్సులు కదా! దూరం కాడ్నిండే మందను చూసినారు కదా! జీపుల్ని నిదానంగా పోనిస్తే సామ్మేం పోతాది. ఎన్నిమాట్లు జీపులోల్లు, కార్లోల్లు గొర్రెల్ని కొట్టి ఆక్కుండా ఇస్పీడుగా ఎల్లిపోతాంటారు. ఆళ్లెంట బడి పట్టుకునీకి మా సేతనైతదా సామీ!

వారం రోజులు కొండలు, గుట్టలు దాటుకుని మద్దెన పత్తికొండకాడ యాదో పల్లెదాపున ఆగితిమి. అమాస రాతిరి. సిమ్మసీకటి. కన్నుబొడిసినా అవత లేందుంది అగవడ్డంలే. ఏదో పొలం పక్కన కళ్లం ఖాళీగుంటే గొర్లన్ని ఆడ జేర్చితిమి. జొన్నరొట్టెలు కాల్చుకుని ఇంటికాడ్నిండి యెంట దెచ్చుకున్న ఎర్రకారం, వూరిమిండి నంజుకోని తిని మంద పక్కనే నేను, మా బుడ్డోడు పండుకొంటిమి. నడిసి నడిసి వళ్లు పులిసినట్లయి నిద్దరలోకి పోతిమి.

మద్దె రాత్రి అగస్మాత్తుగ నిద్దర లేస్తిమి, రాళ్లొచ్చి వర్సం మాదిరి మీన పడ్తాంటే, ఏందని లేసి సూస్తే ఎవరో నలుగురైదుగురు మందపైన రాళ్లు ఇసుర్తా వుండారు. జీవాలన్నీ 'మే, బే' అని అర్సుకుంటూ సీకట్లో దిక్కు కొకటిలెక్క వురికినాయి. ఇంతింత లావు రాళ్లు మీనపడ్తుంటే యేం గాని బయపడి దూరం పారిపోతిమి. సీకట్లో గొర్ల అరుపులు, అరుసుకుంటా ఈ పక్కకు ఆ పక్కకు దిక్కు తెలీక వురుకుతున్న కావలి కుక్కలు అంతా గందరగోళంగుండింది. తెల్లారిందాంకా బిక్కుబిక్కుమంటా పానాలు సేతిలో పెట్టుకోని కూసోనుంటిమి, తెల్లారినాక యెతుక్కుంటా పోతే గొర్లు మైలవతల గుంపుగా సేరి అగవడ్నాక వూపిరి పీల్చుకుంటిమి. మందకాడికి పోయి లెక్క జూసుకుంటే యాభై జీవాలు తక్కు వుండాయి. దొంగనాయాల్లు రాతిరి మామీన మందమీన రాళ్లేసి దొరికిన జీవాల్ని ట్రాక్టర్‌లో యేస్కోని పారిపాయినారు. లబోదిబోమని మొత్తుకుంటా పోలీసు టేసను కాడికి పొయి మా గోడు సెప్పుకుంటె ఆడ ఇంగా గోడాడిచ్చేటోల్లే వుండిరి. పోయిన గొర్లు యెతికి పట్టనీకి టేసన్లో వుండేటోల్లందరికి్కలిపి రెండు జీవాలియ్యమని బేరం

"ఏమిరా, నీ గొర్రెలకూ, నీకూ వళ్లు కొవ్వెక్కినట్లుందే! మా జీపులొస్తాంటే పక్కకు తోలుకునేది లేదేంరా! జీపుకు అడ్డం పడేట్లు చేసి మాకాడ్నించి డబ్బులు గుంజనీకి ఎత్తేసినార్రా! ఈ పిల్లనాకొడుకు బో ఆగిత్యం చేస్తాన్నాడు. ఆ పిల్లనాకొడుకు సంగతి సూడండి!"

పెట్టిరి. ఈళ్లకాడికి బోతే ఒక తాయాన వదుల్తారా. పీనుగులపైన సిల్లరేరుకునేటోల్ల మాదిరి కన్పించిరి. చేసేటి దేందుందని రెండు మంచి గొర్లు ఇచ్చుకుంటిమి. పోయిన జీవాలు ఇంత దాంకా ఒక్కటంటే ఒక్కటి యెతికి వట్టలేకపోయిరి. అడిగి అడిగి, తిరిగి తిరిగి యాసిరికొచ్చి అడిగేదే మానుకుంటిమి. యాభై గొర్లు దొంగనాకొడుకులెత్తుకుపోయినారని ఏడుస్తుంటే ఇంగో రెండు జీవాలు గుండుకుంట్రి. వుండుమీన కారం సల్లినట్లాయె.


మా అగసాట్లు ఎట్లుంటాయో సెప్పనీకే ఈ కతలన్నీ సెప్తన్నా. ఓపికబెట్టి ఇను, సామీ!

ఓసారి మా వూరి పెసిడెంటు ఇంటికి పెద్దాయనెవరో మంతిరంట ఆ యప్పొస్తాండాడని ఆయప్పకు ఆయ నెంటుండేటోల్లకు యాటలు కోసి కూరొండి పెట్టనీకి పెసిడెంటు మన్చులొచ్చి మూడు జీవాలు సామి, బాగా బలిసుండేటివి దుడ్లియ్యకుండా కుంచపోయిరి. పెసిడెంటు కాడికి బోయి మొత్తుకుంటే ఒక్కోటి రెండేలయ్యేదాన్లకు మూడు జీవాలక్కలిపి మూడేలిచ్చి, "ఇంగ సాలు, పోరా గొర్రె నా కొడకా!" అని తిట్టి పంపిచ్చిరి. వచ్చినకాడికి మాదేవ అనుకుంటి. అసలియ్యకున్నా జేసేటిదేముంది. మేం ఎండనక వాననక వూర్లు తిరుక్కుంటా మేపు యాడుంటే ఆడికి బోతా పెంచిన జీవాలు కోసి పెద్దోళ్లకు ఇందు బోజనాలు పెట్టి పెసిడెంటు వలుకుబడి పెంచుకునే పెద్ద పనులు చేతికొచ్చె. మా కొరిగే దేముంది?

ఆ మద్దెన మా యల్లుడు మద్దిలేటి గొర్ల మేతకోసం వలసబోతా అడివి దగ్గర్లో రాత్రికాడ జీవాలు ఆపుకోనుంటే తోడేల్లొచ్చి అయిదు జీవాలెత్తకపాయినాయి. ఇంగోసారి మద్దిలేటి హంద్రీ అంచున గొర్లని తోల్కబోతాంటే ఏరొచ్చి పది జీవాలు కొట్టకపాయె. ఇట్ల ఒక్కటని గాదు లే మా అగసాట్లు!

వానాకాలం ఎప్పుడొస్తాదా జీవాలకింత మేతన్న ఉంటాదని ఎదురు సూసి ఎదురు సూసి ఆశ లొదులుకునే యేళకు ఈతూరి ఇడసకుండా వానలొచ్చే. ముసురువట్టి వారం దాటిన ముసిరిడసకపాయె. ఒకటే వాన. వాగులు వంకలు ఏర్లు నిండిపాయె. ఆకాసం గుండెలదిరేట్లు వురుములతో మళ్లా వానలొచ్చాయే లేదో అన్న మాదిరి కురిసినాది. సెట్లన్ని అమ్మోరి పూనకమొచ్చినట్లు వూగిపాయినాయి. వాన మొదలైన్నాడు రాత్రి మద్దిలేటి మైదనాంలో మందను ఏదో సెట్టుకాడ నిలబెట్టుకోనుంటే సెట్టుమీన పిడుగువడి దానేటుకు పది జీవాలు బుగ్గయిపాయినాయి. వారం దినాలు ఇడిసినట్లే ఇడిసి మళ్లా మొదలయితాండె వాన. ఈ భూమ్మీన వడాల్సిన వానంతా ఈడ్నే కురుస్తాన్నట్లుండే.

వానలు ఆగిన నాల్రోజులు దాట్నాక జీవాలకు పాడురోగాలొచ్చి వడ్నాయి. గొర్లు పాలిట యముల్ల లెక్క గొంతు వాపంట, గాలికుంటు, బొబ్బరోగం, ముసర రోగాలొచ్చి గొర్లు గిరగిర తిరిగి సచ్చినాయి. సానా జీవాలకు నీలి నాలుకని ఏదో మాయదారి రోగమొచ్చి అల్లాడిపాయినాయి. జీవాన్ని అంటుకుంటె పెనంమీన సెయ్యి పెట్టినట్లుంటాది. చెవులు, మెడ, మూతి వాపులై నోట్లోంచి జొల్లు కార్తా నోరు తెరిసి సూస్తే పీర్ల పండక్కు యేసే అగ్గి గుండంలో ఎర్రగా మండే నిప్పు కనికల్లెక్క నాలుక ఎర్రగా పుండుమాదిరి అయి రక్తం గాని నాలుక మీన కార్తా వుండె. గాలి పీల్సనీకే కష్టపడతా వుండె జీవాలు. నాలుక మందమై మేత తిన్లేక బలహీనమై




యేరే రోగాలు కూడా వచ్చినాయి. సూస్తా సూస్తా వుండగానే సివరికి నా గొర్లన్ని మేత దిన్లేక బక్కసిక్కి కదల్లేక యాలబడిపోయి ఆయాన వడ్తా ఒకదానెమ్మటొకటి ఎండాకులు రాలినట్లు రాలిపాయినాయి. పానం బోయిన జీవాలు చిన్నగుట్ట లెక్కవడ్నాయి.

సూస్తావుండగానే గొర్లు పానం బోయి కుప్పలు కుప్పలు సస్తా వుంటె గుండెలు తరుక్కుపోయి ఏడిసి ఏడిసి మా కండ్లెండిపోయినాయి. బుడ్డోడయితే పాగిలి పాగిలి ఏడుస్తాంటే, నా పెండ్లామయితే ఏడ్సనీకే సత్తువ లేక వులుకు వలుకు లేకుండా అట్లనే కూలబడిపాయె.

జీవాలు రోగాలొచ్చి అల్లాడిపోతాంటే ప్రభుత్వ పసుల డాక్టరు యానాడు మంద కాడికొచ్చి మందియ్యలే. ఇంతమందని తోల్కొని టవున్లో ఆసుపత్రికాడికి బోవాలంటే ఎంత కష్టమైతాది. రోగమొచ్చి యాలబడిపోతాండే జీవాలను అంతదూరం తోల్కబోతే దావలోనే దాన్ల పానం బోతాది. ఆడికి ఎట్లనో కష్టమ్మీద మందను తోల్కపోతే ఆసుపత్రిలో మందులేమీ లేవు గానీ చీటి రాసిస్తా కొనుక్కొచ్చుకోమనిరి. ఒక్క మందు పనిచెయ్యలేసామి. అన్నీ నకిలీ మందులు. మూగజీవాలకు నకిలీమందులిచ్చి నాకొడుకులు పురుగులు వడి సస్తారు. సస్తే గొర్లె కదా బోయేటి దేందుందని అడిగేటోల్లుండర్లే అని నకిలీ మందులిచ్చి జీవాల జీవం పోయేట్లు చేస్తా వుండారు.

ఎండలు, వానలు, వరదలు, పిడుగులు, దొంగోల్లు తోడేల్లు, తుపాకు లెంటబెట్టుకుని పోతాండే తోడేల్లు మమ్మల్ని, మా జీవాల్ని బతకనిచ్చేట్లు లేరు.

ఇన్నూరు జీవాలమందకు ఆసామి గుండి ఎవురిమీన వడకుండా సొంతంగా బతుకుతా వుండేటోల్లం తెగిన గాలిపటమైనాది బతుకు. పూలమ్మినకాడ్నే కట్టెలమ్ముకునే గతి వట్టినాది. గొర్లున్నప్పుడు ఏదైనా పనిబడితే అప్పిస్తా వుండిరి ఎవురైనా గాని, గొర్లన్ని పాయినాక అప్పడిగితే "బుట్టా వకీరోనికి ఎవుడిస్తాడని" పురుగును సూసినట్లు సూస్తా వుండారంతా.

నేను నా బుడ్డోడు ఇపుడు యాడకూలీ వున్నదంటే ఆడకు పోయి కూలీ పని చేసుకుని బతుకుతా వుండాము. సొంత మంద మేపుకునేటోల్లం దినం కూలీలైనామని నా పెండ్లాం దినాం ఏడుస్తానే వుండాది!

నా కష్టాల కతలిన్నటందుకు కోటి దండాలు. ■